# ముమ్మరంగా వరి కోతలు

- కొవ్వూరు డివిజన్‌లో 32,131 హెక్టార్లలో దాళ్వా సాగు
- హెక్టారుకు సగటున 9 మెట్రిక్ టన్నుల దిగుబడి
- రైతు భరోసా కేంద్రాల ద్వారా చురుగ్గా కొనుగోళ్లు



దేవరపల్లి మండలం బందపురంలో వరి పంట కోస్తున్న యంత్రం

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో దాళ్వా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయడంతో పండిన పంటను రైతులు గిట్టుబాటు ధరకు విక్రయించుకుంటున్నారు. యంత్రాల ద్వారా పంటను కోసి ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలతో పాటు మిల్లర్లు కూడా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడం వల్ల ఎప్పటి పంటను అప్పుడే సకాలంలో అమ్ముకుని రైతులు సొమ్ము చేసుకుంటున్నారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో వరి కోతలు చురుగ్గా జరుగుతున్నాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

**మండలాలవారీగా సాగు విస్తీర్ణం ఇలా..**

కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో ప్రస్తుత రబీ సీజన్‌లో 32,131 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. హెక్టార్‌కు 8 నుంచి 10 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తున్నట్టు రైతులు తెలిపారు. సగటున 9 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని అధికారులు చెప్పారు. మండలాలవారీగా దేవరపల్లిలో 2832, చాగల్లులో 3322, గోపాలపురంలో 1710 , కొవ్వూరులో 4149, నల్లజర్లలో 2098, నిడదవోలులో 6814, పెరవలిలో 3102, తాళ్లపూడిలో 3447, ఉండ్రాజవరంలో 4657 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. 3,16,664 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి లక్ష్యం కాగా, దీనిలో స్థానిక అవసరాలకు 13,959 మెట్రిక్ టన్నులను మినహాయించగా, మిగిలిన 3,02,705 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్ జరుగుతుందని అధికారుల అంచనా. 10,483 మెట్రిక్ టన్నులు మిల్లర్లు, 2,92,221 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తారని అధికారులు తెలిపారు.

**దిగుబడులు ఆశాజనకం**



"వాతావరణం అనుకూలించడం, చీడపీడలు లేకపోవడంతో ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. డివిజన్‌లో 3.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా. హెక్టార్‌కు సగటున తొమ్మిది మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది. చాగల్లు, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 10 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది. వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే 40 శాతం కోతలు పూర్తయ్యాయి."

– చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు, కొవ్వూరు

**ముక్క శాతం ఎక్కువ**



"ధాన్యంలో ముక్క శాతం ఎక్కువగా ఉంది. గతేడాది కంటే ఎకరాకు 5 నుంచి 6 బస్తాల దిగుబడులు తగ్గుతున్నాయి. గతేడాది ఎకరాకు 50 నుంచి 55 బస్తాలు దిగుబడులు వచ్చాయి. ఈ ఏడాది 42 నుంచి 48 బస్తాల దిగుబడి వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ధర గిట్టుబాటుగా ఉంది. బస్తా (75 కిలోలు) రూ.1637 రేటుకు ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ వంగగాలు దిగుబడులు తగ్గాయి."

– సత్తి జగదీశ్వరరెడ్డి, రైతు, కృష్ణంపాలెం, దేవరపల్లి మండలం

## వైఎస్సార్ సీపీలో చేరతా

సినీ, బుల్లితెర నటుడు బాలాజీ



నల్లజర్ల: సినీ, బుల్లితెర నటుడు ముల్లేటి బాలాజీ తాను త్వరలో వైఎస్సార్ సీపీలో చేరనున్నట్టు ప్రకటించారు. దాదాపు 500 సినిమాలు, 100కు పైగా సీరియల్స్‌లో ఆయన నటించాడు. మండలంలోని దూబచర్లలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన ఈ విషయం తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలు తనను ఎంతగానో ఆకర్షించాయని ఆయనన్నారు. ఈ సారి ఎన్నికల్లో జగన్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. వలంటీర్ వ్యవస్థ తనను ఎంతో ఆకర్షించిందన్నారు. తండ్రిని మించిన తనయుడిగా రాజకీయాల్లో జగన్ ఎంతో పరిణితి చెందారన్నారు.

## అన్నవరప్పాడులో భక్తుల రద్దీ

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను పురోహితులు వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు, శనివారం నుంచే మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి సుమారు ఐదు వేల మందికి అన్న సమారాధాన నిర్వహించినట్టు ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

## క్లుప్తంగా

### ఆసుపత్రికి సాయం అభినందనీయం



కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో పునరుద్ధరణ పనులు ప్రారంభించిన అవంతీ ఫౌండేషన్ చైర్మన్ ఇంద్రకుమార్

కొవ్వూరు: అవంతీ ఫౌండేషన్ సంస్థ స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రూ.10 లక్షల వ్యయంతో ఆపరేషన్ థియేటర్, ప్రసూతి వార్డు, నవజాత శిశువుల గది పునరుద్ధరణ పనులతో పాటు ఏసీలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని సూపరింటెండెంట్ కె.సాయికిరణ్ అన్నారు. ఆయా గదులకు టైల్స్, సీలింగ్‌లు, వాల్ టైల్స్, ఇతర యంత్ర సామగ్రిని అవంతీ ఫౌండేషన్ సంస్థ అందజేసింది. శనివారం ఆసుపత్రిలో అవంతీ ఫౌండేషన్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ ఆయా పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు సుభాషిణి, శాంతికమల, కోటీశ్వరిలతో పాటు అవంతి ఫీడ్స్ జనరల్ మేనేజర్ కేవీ రాజు,ఏజీఎం వై.రామచంద్రరావు, డీజీఎం డి.రామకృష్ణ, హెచ్‌ఆర్ మేనేజర్ ఎస్. తాతాజీ, సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) వి.అమ్మిరాజు, మేనేజర్ పీఆర్ ఎండీకే మొహిద్దీన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలో లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

### వృద్ధులు, అనాథలకు జెడ్పీటీసీ వితరణ

గోపాలపురం: జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత తన జన్మదిన వేడుకలను శనివారం మండలంలోని గొల్లగూడెం గ్రామంలోని లగడపాటి రామలక్ష్మి అనాథ, వృద్ధాశ్రమంలో అనాథ పిల్లల మధ్య నిరాడంబరంగా జరుపుకొన్నారు. వారి సమక్షంలో పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. ఇక్కడున్న 60 మంది అనాథలకు, వృద్ధులకు ఆమె శనివారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అలాగే ఆ ఆశ్రమానికి బస్తా బియ్యాన్ని విరాళంగా అందించారు. కాగా జెడ్పీటీసీ సభ్యురాలు లలితకు రాష్ట్ర హోం మంత్రి తానేటి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మండల మహిళా కన్వీనర్ యండపల్లి కవిత తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### పట్టణ పోలీసు స్టేషన్‌కు వాటర్ కూలర్ అందజేత

కొవ్వూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు, సిబ్బంది దాహార్తి తీర్చేందుకు స్థానిక శివసాయి దామం సేవాసమితి వాటర్ కూలర్‌ను విరాళంగా అందజేసింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.జగదీశ్వరావుకు వాటర్ కూలర్‌ను అందజేశారు. తమ సేవాసమితి ఆధ్వర్యంలో ఇంత వరకూ 15 అనాథ శవాలకు ఉచితంగా దహన సంస్కారాలు చేశామని సమితి అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సమితి సభ్యులు పరిమి రాజేష్, రెడ్డి తాతయ్య బాబు, నగళ్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సులు భద్రం

కొవ్వూరు: రానున్న లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్‌కు వినియోగించే అన్ని బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాడ్‌లను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచామని కొవ్వూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పట్టణంలోని సంస్కృత పాఠశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో శుక్రవారం రాత్రి వాటన్నింటినీ భద్రపరిచామన్నారు. భద్రపరిచిన రూముకు రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలోనే సీలు వేశామన్నారు. సహాయ ఎన్నికల అధికారి కె.మస్తాన్, ఎలక్షన్ డీటీ కమల్ సుందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

ముగ్గురికి స్వల్ప గాయాలు

దేవరపల్లి: కర్నూల్ నుంచి విశాఖ వెళుతున్న ఆర్టీసీ బస్సు మండలంలోని గౌరీపట్నం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. బస్సులో 27 మంది ప్రయాణికులు ఉండగా, వారిలో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయన్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

### రూ.54,300 నగదు స్వాధీనం

నల్లజర్ల: మండలంలోని కవులూరు వద్ద శనివారం రాత్రి బైక్‌పై తరలిస్తున్న రూ.54,300 నగదును ఎన్నికల ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందం స్వాధీనం చేసుకుంది. దక్షిత్ మార్కెటింగ్ సభ్యులు ఈ మొత్తాన్ని జంగారెడ్డిగూడెం నుంచి బైక్‌పై తాడేపల్లిగూడెం తరలిస్తుండగా ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు జె.గణేష్ తెలిపారు. సొమ్ము తరలిస్తున్న వారు ఈ మొత్తానికి ఎటువంటి ఆధారాలు చూపలేదన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- చాగల్లు బీసీ ఏరియాలో ఇంటింటా ప్రచారం



చాగల్లు ప్రచారంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: సంక్షేమానికి, అభివృద్ధికి ప్రజలు మరోమారు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాశీర్వాదం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన చాగల్లు బీసీ ఏరియాలో శనివారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచీ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి ఆయన ఆ ప్రాంత ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా తమను చిరునవ్వుతో ప్రజలు ఆహ్వానిస్తున్నారన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారని అన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి తనను, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జువరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంట్రోతు సురేంద్రకుమార్, మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# దయచేసి మళ్లీ గెలిపించండి

పెరవలి: పేదలు, రైతులు, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించాలని ఆ పార్టీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన పెరవలిలో ఎన్నికల ప్రచారాన్ని శనివారం సాయంత్రం ఆయన ఉత్సాహంగా ప్రారంభించారు. బాణసంచా కాల్పులు, కంజెర డప్పు వాయిద్యాల మధ్య వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా కదం తొక్కాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ఎటువంటి అవినీతికీ అవకాశం లేకుండా గత ఐదేళ్లూ నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పిస్తే నిడదవోలును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఎటువంటి అవినీతి మచ్చ లేకుండా జీఎస్ రావు కుటుంబం 30 ఏళ్లుగా ప్రజా సేవ చేస్తోందని గుర్తు చేశారు. టీడీపీ కూటమికి ఓటు వేస్తే భవిష్యత్తులో కష్టాలు కొని తెచ్చుకున్నట్టే అని ప్రజలందరూ గమనించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, సర్పంచ్ గంగోలు సీతమ్మ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, రామదుగుల సూర్యనారాయణ, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నాయి.



పెరవలి ఎన్నికల ప్రచారంలో నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు



# నిస్వార్థంగా సేవ చేశారు .. గెలిపించండి

ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా కుమారుడు వరుణ్‌సాయి ఎన్నికల ప్రచారం



నిడదవోలు రాయపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి కుమారుడు వరుణ్‌సాయి

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు సీలింగ్ ఫ్యాన్‌పై ఓట్లు వేసి జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడి కుమారుడు వరుణ్‌సాయి కోరారు. ఆ పార్టీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి, తన తండ్రి శ్రీనివాస్ నాయుడికి మద్దతుగా వరుణ్‌సాయి శనివారం పట్టణంలోని రాయపేటలో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌సాయి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాలు, పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. తన తండ్రి శ్రీనివాస్‌నాయుడు నిడదవోలు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తమ కుటుంబం అంతా అవినీతికి తావు లేకుండా ప్రజాసేవలో నిమగ్నమయ్యామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యేగా శ్రీనివాస్‌నాయుడులను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు బిర్రె పార్వతి, కొత్తపల్లి సుప్రియ, పువ్వల రతీదేవి, దాకే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కే చాన్‌బాషా, గంగుల గోపియాదవ్, అప్సర్ జానీ, మారిశెట్టి పద్మ, కోడి గోపి పాల్గొన్నారు.

# రక్తదానం చేసిన వారంతా ప్రాణదాతలే


- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- శిబిరంలో 40 మంది రక్తదానం



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, యునైటెడ్ స్ట్రెంత్ మాల యూనియన్ సభ్యులు

కొవ్వూరు: రక్తదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న ఎందరో ప్రాణాలు కాపాడవచ్చని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని యునైటెడ్ స్ట్రెంత్ మాల యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మదర్ థెరిసా హోమ్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు నలభై మంది రక్తదానం చేశారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు రక్తదానం చేసిన యువకులను అభినందించి పండ్లు, జ్యూస్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి, స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్, కౌన్సిలర్ కంతమణి రమేష్‌తో పాటు గుమ్మడి శైలేంద్రరావు, ఎండీ ఆలీ, యునైటెడ్ స్ట్రెంత్ సభ్యులు కప్పల రాజేష్, గారపాటి రవికిషోర్, బిరుదుగంటి ప్రవీణ్, బొల్లారపు ప్రసాద్, చిన్నం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మంచి జరిగితేనే ఓట్లు వేయండి



21వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ శ్రేణులు

నిడదవోలు: జగనన్న పాలనలో మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే ఆయనను మరోసారి ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కోరారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా శనివారం సాయంత్రం పట్టణంలోని 21వ వార్డులో ఆదినారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి, ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే చాన్‌బాషా, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, పార్టీ నాయకులు దిరిశన రామచంద్రరావు, గంగుల గోపియాదవ్, గంటా సురేష్, మేడపాటి రామ్మోహన్‌రెడ్డి, తోలేటి కోటేశ్వరరావు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నలుగురు వలంటీర్ల రాజీనామా

దేవరపల్లి: మండలంలోని లక్ష్మీపురం గ్రామ వలంటీర్లు నలుగురు శనివారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి ఎస్.రవికిషోర్‌కు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు స్వచ్ఛందంగా అందిస్తున్న తమపై టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు నిందలు వేయడంతో మనస్తాపం చెంది రాజీనామాలు చేస్తున్నట్టు తెలిపారు.